



మనోగతం - శ్రీరామ జయం

- శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు

దేశ ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు.

శ్రీ రాముడు మర్యాదా పురుషోత్తముడు. ఆదర్శపురుషుడు. ఏకపత్నీ వ్రతుడు, సత్యవాక్పరిపాలకుడు, పితృవాక్పరిపాలకుడు. అన్నింటికీ మించి ఆదర్శపాలకుడు. శ్రీ రామనవమి పండుగ రాముని ఆదర్శ వ్యక్తిత్వాన్ని గుర్తు చేస్తుంది. ఆయన చూపించిన ధర్మ మార్గం వైపు మనల్ని నడపడమే గాక మన కుటుంబం, సమాజం, దేశం పట్ల మన కర్తవ్యాలను, బాధ్యతలను గుర్తు చేస్తుంది. తన రాజ్యంలోని ప్రజలకు

శ్రీ రాముడు అందించిన న్యాయం, సుపరిపాలన, సంక్షేమం లాంటివి ఆయన దృఢసంకల్పాన్ని, నిబద్ధతను తెలియజేస్తాయి. అందుకే నేటికీ రామరాజ్యం ఎందరో పాలకులకు స్ఫూర్తిని పంచుతూనే ఉంది.

శ్రీ రాముని స్ఫూర్తి ఎలాంటిదనే విషయాన్ని తెలుసుకోవడానికి ఒక్కసారి సుందరకాండను పరిశీలిస్తే మనకు అవగతమౌతుంది. అశోక వనాన్ని నాశనం చేసిన హనుమంతుణ్ని పట్టి బంధించాల్సిందిగా 80 వేల మంది రాక్షసుల్ని రావణుడు ఆదేశించినప్పుడు... హనుమంతుడు చెప్పిన "జయమంత్రం" ఇది.

జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః |

రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః ||

దాసోహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్ట కర్మణః |

హనుమాన్ శత్రుసైన్యానాం నిహన్తా మారుతాత్మజః ||

న రావణ సహస్రం మే యుద్ధ ప్రతిబలం భవేత్ |

శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః ||

అర్ధయిత్వా పురీం లంకాం అభివాద్య చ మైథిలీమ్ |

సమృద్ధార్థ గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్||

"రామ, లక్ష్మణులు విశేష బలంతో వర్ధిల్లుతున్నారు. రామ రక్షతో వానర రాజైన సుగ్రీవుడు జయముతో శోభిల్లుతున్నాడు. అలాంటి రాముడికి దాసానుదాసుణ్ని నేను. నా పేరు హనుమంతుడు. యుద్ధంలో నేను వేరే ఆయుధాలు వాడను. ఈ రావణ సైన్యాన్ని నా కాళ్ళ కింద తొక్కేస్తాను. పిడిగుద్దులతో అంతమొందిస్తాను. పెద్ద చెట్లతో, రాళ్ళతో కొడతాను. వెయ్యిమంది రావణులైనా నా భుజాల కింద కీటకంతో

సమానం. నన్ను ఆపగలిగేవారు ఈ లంకా పట్టణంలో లేరు. సీతమ్మకి నమస్కరించి ఎలా వచ్చానో, అదే విధంగా ఈ సముద్రాన్ని దాటివెళతాను. అంటూ హనుమంతుడు తెలియజేశారు. దీన్నే జయమంత్రంగా చెబుతారు.

పనుల్లో విజయానికి ఈ జయమంత్రం పఠించాలని పెద్దలు చెబుతుంటారు. ఈ మంత్రం చదివితే విజయాలు సిద్ధిస్తాయని కాదు. ఇందులోని అంతరార్థాన్ని అర్ధం చేసుకుంటే విజయాలు కచ్చితంగా లభిస్తాయి. మొదటిది బలమైన నమ్మకం. నా వెనుక రాముడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు ఉన్నారు. వారు ధర్మాన్ని పాటించిన వారు. అంటే ధర్మబద్ధమైన నమ్మకం మనిషికి కావలసిన మొదటి ఆయుధం. విజయం దిశగా సాగే మార్గంలో ఇదే మొదటి సూత్రం.

ఇక రెండోది ఆత్మవిశ్వాసం. నా ముందు రావణుడు పురుగుతో సమానం అని చెప్పడం వెనుక అతివిశ్వాసం కాదు, ఆత్మవిశ్వాసం ఉంది. నా ముందు అంటే... ఇక్కడ ధర్మమార్గంలో ముందుకు సాగుతున్న నా ముందు, అధర్మ మార్గంలో ఉన్న రావణుడు నిలవలేడు అని చెప్పడమే అంతరార్థం. నిజంగా మన సంకల్పం ధర్మబద్ధమైనది అయినప్పుడు ఇలాంటి ఆత్మవిశ్వాసం మనలోనూ ఉంటుంది.

మూడోది ఆయుధం. కాళ్ళతో తొక్కేస్తూ, పిడి గుద్దులతో, చెట్లతో, రాళ్ళతో యుద్ధం చేస్తానంటూ హనుమంతుడు ఆత్మవిశ్వాసం చెప్పడం వెనుక ఉన్న కారణాన్ని మనం గ్రహించాలి. చాలా మంది నా దగ్గర ఫలానిది లేదు, నాకు ఫలానిది ఉంటే బాగుండేది అనుకుంటూ కాలయాపన చేస్తారు. అలాంటి మనస్తత్వాన్ని వదులుకోవాలనే అంశాన్ని ఈ జయమంత్రం తెలియజేస్తోంది. ఉన్న వనరులతో విజయాన్ని సాధించిన ఎన్నో విజయ గాధలను మనం నిత్యం చూస్తూనే ఉంటాం. ఇదే స్ఫూర్తి వారి విజయాల్లో దాగి ఉంది.

వీటన్నింటకంటే అత్యంత ప్రధానమైనది సంకల్పం. సంకల్ప బలంతో సాధించలేనిది ఏదీ లేదు. సుందకాండలో హనుమంతుని ఆత్మవిశ్వాసం కావచ్చు, అడవిలో కష్టాలు భరించి, సీతను కనుగొని, రావణున్ని సంహరించిన శ్రీరాముడి పట్టుదల కావచ్చు, రామునికి సాయం చేసి ఉడత కావచ్చు... ఇవన్నీ

సంకల్ప బలానికి ప్రతీకలు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసే శక్తి సంకల్పానికి ఉంది. సాధారణ వ్యక్తిని సైతం మహనీయుడిగా మార్చే గుణం దానిది. మనమంతా జీవితంలో ఏ సందర్భంలోనైనా విజయాన్నే కోరుకుంటాం. అయితే సాధించేది మాత్రం కొంత మందే. మరికొంత మంది విజయం దిశగా పరుగు పెట్టి మధ్యలోనే ఆగిపోతారు. జీవితంలో జయాపజయాలకు కారణాలు ఎన్ని ఉన్నా, సంకల్పబలం లేకపోవడమే ఓటమికి ముఖ్యకారణమని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. మనిషికి సంకల్పబలం ఉంటే చాలు దేన్నైనా సాధించగలడు, గమ్యాన్ని చేరుకోగలడు.

ఒక్క మాటలో చెప్పాలంటే ఔన్నత్యం కార్యసాధకుడికి ఉండాల్సిన ప్రధాన గుణం. శ్రీరాముని చర్యలు పరిస్థితిని బట్టి కఠినంగా, శిక్షించే విధంగా లేదా సౌమ్యంగా ఉండేవి. విశ్వామిత్రుని ద్వారా బల, అతిబల విద్యలు అభ్యసించిన శ్రీరామునికి యుద్ధంలో విజయం చాలా సులభం. అయితే ప్రతి చోట ధర్మాధర్మ విచక్షణతో యుద్ధం చేశాడాయన. తాటకిని చంపాల్సి వచ్చినప్పుడు, అంతటి రాక్షసి పట్ల కూడా స్త్రీ అనే విచక్షణ చూపించిన ఔదార్యం శ్రీరామునిది. రావణుడితో యుద్ధ సమయంలో కూడా అతడి రథాన్ని విరగ్గొట్టి, ఆయుధాలు కోల్పోయేలా చేసి, విజయానికి ముందు నిలబడినప్పటికీ... "ఇప్పుడు నువ్వు వెళ్ళవచ్చు. ఈ రోజు నువ్వు బాగా పోరాడావు. వెళ్ళి విశ్రాంతి తీసుకో, రేపు నూతన ఉత్సాహంతో, ఆయుధాలతో తిరిగి రా." అంటూ ధర్మాన్ని అనుసరించారు. రావణుడి వధ తర్వాత సైతం, యుద్ధంలో మరణించిన యోధునిలా రావణున్ని గౌరవించాడే తప్ప, శత్రువు అనే భావాన్ని చూపించలేదు.

ఇదే స్ఫూర్తిని తరతరాలు భారతదేశం ఆచరణలో చూపిస్తోంది. ఈ సందర్భంగా నాకు శ్రీ అటల్ బిహారీ వాజ్ పేయి గారి ఔన్నత్యం గుర్తుకు వస్తోంది. కార్గిల్ యుద్ధం సమయంలో ప్రాణాలర్పించిన భారత సైనికుల అంత్యక్రియలను గౌరవప్రదంగా నిర్వహించడమే కాకుండా, చనిపోయిన పాకిస్థాన్ సైనికుల మృతదేహాలను సైతం సగౌరవంగా పాకిస్థాన్ కు అప్పగించిన మానవీయత ఆయన సొంతం. ఇదే భారతదేశ స్ఫూర్తి. తరతరాలుగా శ్రీరాముడు మన రక్తంలో బలంగా నాటిన సంస్కారం కూడా. ఇదే స్ఫూర్తి యువతకు ఆదర్శం కావాలి.

జై శ్రీరామ్ అంటే భగవంతుడిగా శ్రీరాముణ్ని పూజించడం మాత్రమే కాదు... ఆయన వ్యక్తిత్వాన్ని, విలువలను గౌరవించి, ఆచరించడం కూడా. రామాయణాన్ని పఠించడం, సుందరాకాండను పారాయణ చేయడం అంటే చదివి వదిలేయడం కాదు. అందులోని సందేశాన్ని తెలుసుకుని ముందుకు సాగడం. సగటు మనిషి జీవితాన్ని ముందుకు ఎలా సాగించాలన్నదానికి శ్రీరాముని విలువలే స్ఫూర్తి. ఇదే ప్రేరణ, ఆత్మవిశ్వాసం, సంకల్పబలం నిజమైన విజయాలను అందిస్తాయి. మన పెద్దలు "శ్రీరామ జయం" అంటూ విజయాలకు శ్రీరామచంద్రుని ఆదర్శంగా కొలవడం వెనుక అంతరార్థం కూడా ఇదే. ఈ స్ఫూర్తితో యువతరం, వికసిత భారతదేశ నిర్మాణానికి చోదకశక్తులు కావాలని ఆకాంక్షిస్తున్నాను.

మరోసారి దేశ ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

జైహింద్..